క్లుప్తంగా

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సేవా గుణం చాటుకున్న వలంటీర్‌



విస్సన్నపేట: అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విస్సన్నపేటకు చెందిన వృద్ధురాలు షేక్‌ హుసేన్‌బీకి తన సొంత ఖర్చులతో విజయవాడ ఆస్పత్రికి వెళ్లి ఆదివారం వితంతువు పింఛను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు సచివాలయ-1 వలంటీర్‌ నీలోఫర్‌. పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు వలంటీర్‌ను అభినందించారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

రెడ్డిగూడెం: మండల కేంద్రంలో క్రైస్తవులు శాంతి ర్యాలీని ఆదివారం నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేసి పెద్ద ఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. రెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో మానవ హారం, దేశంలో శాంతికోసం ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్‌ఐ సంఘ గురువులు రెవ జి. విశ్వనాథ్‌, ఆర్‌సీఎం ఉపదేశియేసుపాదం, సెవెన్త్‌డే పాస్టర్‌ ధానియేలు, పాస్టర్లు యేసోబు, పాల్‌ ఇమ్మానియేలు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): విద్యార్థిని అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పాత రాజరాజేశ్వరిపేట జెండా చెట్టు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె స్థానిక హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. బాలిక స్థానికంగా ఉండే తాతయ్య ఇంట్లో ఉంటుంది. శుక్రవారం రాత్రి పేటలోని దర్గాలో చందనోత్సవం జరిగింది. కార్యక్రమానికి కుటుంబ సభ్యులందరూ హాజరుకాగా, తెల్లవారుజామున బాలిక, తాతయ్య ఇంటికి వెళ్లి నిద్రపోయారు. శనివారం ఉదయం నిద్రలేచిన తాతయ్యకు బాలిక కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె తండ్రికి కబురు పెట్టాడు. అక్కడ కూడా బాలిక కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

11న విశేష పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్‌ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆయా గ్రామాల్లోని భక్తులు పాల్గొనాలని కోరారు.

సర్కారీ బడులు.. అధునాతన హంగులు

- నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- కార్పొరేట్‌ బడులకు దీటుగా హంగులు



ఆగిరిపల్లి నూగొండపల్లిలో అభివృద్ధి చేసిన ప్రాథమికోన్నత పాఠశాల

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో పెచ్చులూడిన శ్లాబులు, విరిగిన బల్లలు, పగిలిన గచ్చులు.. ఇలాంటివి అన్నీ గతం. ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అధునాతన హంగులతో ప్రభుత్వ పాఠశాలలు ఆకట్టుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. ఇందులో భాగంగానే నాడు-నేడు పథకాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌ బడులకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లో ఉద్భవించిన నాడు-నేడు పథకంతో సర్కారు బడులన్నీ కొత్త హంగులు సంతరించుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు అన్ని సదుపాయాలతో ఆహ్లాదకరంగా, అందంగా ముస్తాబయ్యాయి. నాడు-నేడు మొదటి విడతలో భాగంగా నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి రూ.45 కోట్లతో 120 పాఠశాలలను అభివృద్ధి చేశారు. విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. తరగతి గదుల్లో డెస్కులతో కూడిన బెంచీలు, విద్యుత్‌ సదుపాయం, టైల్స్‌, బ్లాక్‌బోర్డు స్థానంలో గ్రీన్‌ బోర్డులు, హైస్కూళ్లలో మినరల్‌ వాటర్‌ సదుపాయం తదితర వాటితో విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు-నేడులో అభివృద్ధి పరిచిన ముసునూరు మండలం చెక్కపల్లిలోని హైస్కూల్‌



రంగురంగుల ప్రహరీతో నూజివీడులోని పీఆర్‌ దే స్కూల్‌

అందుబాటులోకి అన్ని సదుపాయాలు



నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ బడులు ఈ విధంగా అభివృద్ధి చెందుతాయని గతంలో ఎప్పుడూ భావించలేదు. అన్ని సదుపాయాలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. విద్యార్థులకు ఇంత చక్కని సౌకర్యాలు గతంలో ఎప్పుడూ లేవు.

– జీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు, నూజివీడు

ఆయిల్‌పామ్‌ సాగును విస్తరింపజేయాలి

నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ అప్పారావు



ఆయిల్‌పామ్‌ మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ అప్పారావు

ముసునూరు: గోద్రేజ్‌ ఆగ్రోవెట్‌ కంపెనీ చొరవతో రైతులు ఆయిల్‌పామ్‌ సాగును మరింత విస్తరింపజేయాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు పేర్కొన్నారు. ముసునూరులో గోద్రేజ్‌ ఆగ్రోవెట్‌ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయిల్‌పామ్‌ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కంపెనీ అసోసియేట్‌ ఉపాధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆయిల్‌పామ్‌ రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఆయిల్‌పామ్‌ అమ్మకాలు, కొనుగోళ్లలో దళారుల మోసాలను అరికట్టి, ఈ ప్రాంత రైతులకు మేలు, లాభాలు కలిగేలా కంపెనీ చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. డీజీఎం వేగుంట స్వీటీ మాట్లాడుతూ రైతులకు ఉపయుక్తమైన దీర్ఘకాలిక ప్రణాళికలతో ఆయిల్‌పామ్‌ సాగులో మెలకువలను వివరించారు. రైతులు పండించిన గెలల్లోని పక్వానికి వచ్చిన కాయలతో పలు ఉత్పత్తుల సృష్టి ఇక్కడే జరుగుతుందన్నారు. ఆయిల్‌పామ్‌ పంటకు అవసరమైన డ్రిప్‌లు (బిందు సేద్య పరికరాలు), ఎరువులు, పురుగు మందులు, గెలల కోత సామగ్రి సమాధానాల్లో లభిస్తాయన్నారు. రైతులకు సలహాల కోసం శాస్త్రవేత్తలు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్‌ హిస్టరీ అకాడమీ డైరెక్టర్‌ స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌, ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్‌ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్‌, సర్పంచ్‌ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, మండల వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, హెచ్‌ఓ ప్రియాంక పాల్గొన్నారు.

ఓపెన్‌ స్కూల్‌ అడ్మిషన్లు ప్రారంభం



తిరువూరులో ఓపెన్‌ స్కూల్‌ కోర్సులపై అవగాహన ప్రదర్శన

తిరువూరు: రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్‌, పదో తరగతి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎన్టీఆర్‌ జిల్లా కో-ఆర్డినేటర్‌ బాబూరావు తెలిపారు. తిరువూరు సిద్ధార్థ స్కూలు ఆవరణలోని ఓపెన్‌ స్కూలు స్టడీ సెంటర్‌ను ఆదివారం సందర్శించిన అనంతరం ఓపెన్‌ స్కూల్‌ విద్యావిధానంపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగులు పదోన్నతుల కోసం ఓపెన్‌ స్కూల్‌ ద్వారా పరీక్షలు రాసి సర్టిఫికెట్లు పొందవచ్చని తెలిపారు. సిద్ధార్థ స్కూల్‌ కరస్పాండెంట్‌ చక్రపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో పుంగనూరు విధ్వంసకాండ



మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివారెడ్డి, అంక మోహనరావు

ఇబ్రహీంపట్నం: ఓటమి భయంతో టీడీపీ నాయకులు పుంగనూరులో విధ్వంసకాండ సృష్టించారని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీఏసీఎస్‌ చైర్మన్‌ మునగాల సాంబశివారెడ్డి, జిల్లా కార్యదర్శి లంకే అంక మోహనరావు, కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్‌ గుంజా శ్రీనివాస్‌ అన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం వైఎస్సార్‌ సీపీ కార్యాలయాల వద్ద టీడీపీ విధ్వంసకాండను తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం నాయకులు మాట్లాడారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి అన్ని వర్గాల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండబట్టే టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని పన్నాగం పన్నారన్నారు. పోలీసులపై దాడిచేయడం, గాయాల పాలుచేయడం దారుణం అన్నారు. జిల్లా ఐటీవింగ్‌ అధ్యక్షుడు ప్రసన్నబోసు, కౌన్సిలర్‌ వెంకయ్య నాయుడు, గురవయ్య, బ్రహ్మాజీ, ప్రకాష్‌, దివాకర్‌, చిన్నయ్య, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

9న వికాస్‌ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

విస్సన్నపేట: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ ఎంఎస్‌ఎన్‌ ల్యాబొరేటరీస్‌ ఆధ్వర్యంలో స్థానిక వికాస్‌ పీజీ కళాశాల క్యాంపస్‌లో ఈ నెల 9వ తేదీన ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు వికాస్‌ విద్యాసంస్థల చైర్మన్‌ నరెడ్ల నర్సిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ ఎంపికలకు ఎమ్మెస్సీ ఆర్గానిక్‌ కెమిస్ట్రీ, అనలిటికల్‌ కెమిస్ట్రీ, డిగ్రీ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తిచేసిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు వికాస్‌ కళాశాల ప్రిన్సిపాల్‌, ప్లేస్మెంట్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ చల్లా సుధీర్‌రెడ్డిని వ్యక్తిగతంగా కాని, 98495 53107లో సంప్రదించాలని తెలిపారు.

పోలీసులపై దాడులకు తెగబడడం అమానుషం

పుంగనూరు ఘటనలపై ఎమ్మెల్యే విమర్శలు



ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ అప్పారావు

ముసునూరు: దేశంలో నేనే సీనియర్‌ అని చెప్పుకునే చంద్రబాబు 2024లో రానున్న ఓటమికి బెంబేలెత్తి పోలీసులపై దాడులు చేయించడం అమానుషం, అనాగరికమని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ అప్పారావు పేర్కొన్నారు. చెక్కపల్లిలో వైఎస్సార్‌ సీపీ నేతలతో కలసి ఆదివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు తనకు అన్నీ తెలుసని చెప్పుకుంటూ ర్యాలీకి అనుమతి ఉన్న మార్గాన్ని వదలేసి, పుంగనూరు రహదారిలో ప్రవేశించి, నిలువరించిన పోలీసులపై టీడీపీ అల్లరి మూకలను రెచ్చగొట్టి, కర్రలు, రాళ్లతో దాడులు చేయించడం అవివేకం అని పేర్కొన్నారు. పోలీసులపై భౌతిక దాడులు చేయించడం, వాహనాలను దగ్ధం చేయించడం ప్రతిపక్ష నేతకు తగదన్నారు. అనుభవం అంతా ఎటుపోయింది, చేతులు ఊపుకుంటూ టీడీపీ శ్రేణులను పోలీసులపైకి ఉసిగొల్పడం నీతి మాలిన చర్య అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని, ఇకపై నీ మోసాల బారిన ఎవరూ పడబోరని అన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): ప్రజాగాయకుడు గద్దర్‌ లేనిలోటు బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గద్దర్‌ మృతికి సంతాపం వ్యక్త చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: రచయిత, విప్లవ కవి గాయకుడు గద్దర్‌ మృతి తీరని లోటని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా గాయకుడు, రచయిత గద్దర్‌ మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటు అని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మదర్‌ థెరిసా చారిటబుల్‌ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గద్దర్‌ మృతి చెందడం బాధాకరమన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో మృతిచెందిన ప్రజా గాయకుడు గద్దర్‌కు ఎన్టీటీపీఎస్‌లోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఉద్యోగులు శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక అంబేడ్కర్‌ విగ్రహం వద్ద గద్దర్‌ చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. అసోసియేషన్‌ నాయకులు వెంకటరమణ, రత్తయ్య, నాగమల్లేశ్వరరావు, నేపా సత్యనారాయణ, కాంతారావు పాల్గొన్నారు.

అంతరాలయ దర్శనం టికెట్లు రద్దుచేయాలి

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో ఇటీవల ప్రవేశపెట్టిన అంతరాలయ దర్శనం టికెట్టు రూ.100ను రద్దు చేయాలంటూ స్వామి భక్త బృందం సభ్యులు ఆదివారం ఈఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సామాన్య ప్రజలకు సైతం స్వామిని దర్శించుకునేలా గతంలో మాదిరిగానే అవకాశం కల్పించాలంటూ వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. భక్తబృందం సభ్యులు కాజా రవి, ఏ క్రాంతికుమార్‌, కే నాగగోపాలకృష్ణ, పేట అప్పారావు, యుగంధర్‌ పాల్గొన్నారు.

దుర్గగుడి బస్సుల్లో ఈఓ తనిఖీలు



తనిఖీ చేస్తున్న దుర్గగుడి ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రైల్వేస్టేషన్‌, బస్టాండ్‌ల నుంచి దేవస్థానానికి నడుపుతున్న బస్సుల్లో దుర్గగుడి ఈఓ భ్రమరాంబ తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఓం టర్నింగ్‌ వద్ద బస్సులను తనిఖీ చేసిన ఈఓ భ్రమరాంబ భక్తులతో మాట్లాడారు. కండక్టర్‌ వద్ద మెషిన్‌ రికార్డు పరిశీలించడంతో పాటు టికెట్ల డబ్బులను లెక్కించారు. రికార్డు మొత్తానికి టికెట్ల డబ్బులు సరిపోవడంతో వారికి పలు సూచనలు చేశారు. భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగడం, వారిని సకాలంలో రైల్వే స్టేషన్‌, బస్టాండ్‌లకు చేర్చేలా చూడాలని ఆదేశించారు.

కృష్ణకిషోర్‌ సామాజిక సేవలు వెలకట్టలేనివి

విజయవాడ కల్చరల్‌: జనవిజ్ఞానవేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్‌ చేసిన సామాజిక సేవలు వెలకట్టలేనివని పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. విజయవాడ బుక్‌ ఫెస్టివల్‌ సొసైటీ, కామ్రేడ్‌ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, సమతా సేవా సమితి, సంగమం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్‌ సంస్మరణ సభను బుక్‌ ఫెస్టివల్‌ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ సమాజంలోని మూఢాచారాల నిర్మూలనకు నిరంతర కృషి చేసినట్లు తెలిపారు. 1988 నుంచి జన విజ్ఞాన వేదికలో కీలకంగా పనిచేసినట్లు తెలిపారు. బుక్‌ ఫెస్టివల్‌ సొసైటీ పూర్వ అధ్యక్షుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ కళల ద్వారా సామాజిక మార్పును ఆశించిన కార్యకర్త ఆయన అని అభివర్ణించారు. విజయవాడ బుక్‌ ఫెస్టివల్‌ సొసైటీ అధ్యక్షుడు మనోహర్‌ నాయుడు మాట్లాడుతూ ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవం విజయవంతం అవడానికి ఆయన కృషి చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. మంగళగిరికి చెందిన నటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఎస్టీయూ సమావేశం

మైలవరం: స్థానిక పెన్షనర్ల సమావేశ హాల్లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బిక్షమయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ఎం. బసవయ్య, కోట శ్యాంప్రసాద్‌, సాగర్‌, కిషోర్‌, వివిధ మండలాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రగాళ్లను కాదు.. వైద్యులను సంప్రదించండి

తిరువూరు: ఆధునిక ప్రపంచంలో సైన్స్‌ ఎంతో అభివృద్ధి సాధించనప్పటికీ ప్రజలు మూఢనమ్మకాలను వీడకపోవడం విచారకరం అని జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్‌ అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున జూనియర్‌ కళాశాలలో మూఢనమ్మకాల నియంత్రణపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే ప్రజలు వైద్యులను సంప్రదించాలి తప్ప మంత్రగాళ్లని కాదన్నారు. మూఢనమ్మకాలపై ప్రదర్శించిన ఇంద్రజాలం ఆకట్టుకొంది. జేవీవీ మండల అధ్యక్షుడు పాపారావు, ప్రిన్సిపాల్‌ శేషగిరిరావు, అధ్యాపకులు హనుమంతరావు, రాజు పాల్గొన్నారు.

సూర్యనారాయణరెడ్డికి పరామర్శ

పుట్రేల (విస్సన్నపేట): ఏఎంసీ మాజీ చైర్మన్‌ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సతీమణి నాగావళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఏపీ టిడ్కో డైరెక్టర్‌ డాక్టర్‌ కోనేరు సత్యప్రియ దంపతులు ఏఎంసీ మాజీ చైర్మన్‌ను ఆదివారం పరామర్శించారు. గ్రామ ప్రముఖుడు రేగళ్ల ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జి నాగేశ్వరరావు, తాతకుంట్ల ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కాలీషా, స్థానిక ఎస్సీ నాయకులు భాస్కరరావు తదితరులు సూర్యనారాయణరెడ్డిని పరామర్శించారు.

9వ తేదీన మహాధర్నాను జయప్రదం చేయండి

రెడ్డిగూడెం: మోదీని గద్దె దించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ నెల తొమ్మిదో తేదీన కార్మిక ఉద్యోగ సంఘాలు తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ రెడ్డిగూడెం సీఐటీయూ మండల కమిటీ సమావేశం కొండపల్లి పరమేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్‌ సుధాకర్‌ మాట్లాడుతూ విజయవాడ అలంకార్‌ సెంటర్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సీఐటీయూ మండల నాయకులు టి నాగరాజు, వి. వెంకటరామయ్య, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం

నూజివీడు: గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేస్తున్న కేంద్ర నిధుల మళ్లింపుతో పంచాయతీలు నిర్వీర్యమవుతున్నాయని బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్‌ అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దోసపాటి జనార్దనరావు అధ్యక్షతన ఆదివారం బీజేపీ నూజివీడు పట్టణ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజశేఖర్‌ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు మేరకు ఈ నెల 10న ఏలూరులో నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు జరిగాయి. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పూజల్లో పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి పంపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



ఆగిరిపల్లి(నూజివీడు): పుట్టుకతో గానీ, ప్రమాదంలో గానీ శరీర అవయవాలు కోల్పోయిన దివ్యాంగ బాలలు స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న కృత్రిమ అవయవాలతో ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని విద్యను, జీవిత నైపుణ్యాలను నేర్చుకొని స్వశక్తి వంతులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్‌ సమగ్ర శిక్ష డైరెక్టర్‌ మస్తానయ్య అన్నారు. మండలంలోని తోటపల్లిలోని ఎలిజబెత్‌ పాంటన్‌ లెగసి ఆఫ్‌ హోప్‌ హీల్‌ కృత్రిమ అవయవ కేంద్రం తరఫున తెలంగాణ రాష్ట్రం మేళ్లచెరువుకు చెందిన బుర్రా యశ్వంత్‌, తూర్పుగోదావరి జిల్లా పి వేమవరానికి చెందిన జి గుణసాయి వర్మ, ఒంగోలుకు చెందిన రాయల సునీతకు, విజయవాడ లయన్స్‌ క్లబ్‌ వారి ఆర్థిక సాయంతో ఏలూరు జిల్లా చాట్రాయికి చెందిన దేశిరెడ్డి సామ్రాజ్యానికి కృత్రిమ కాళ్లను ఆదివార అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవాలు లేవని ఏమాత్రం కుంగిపోకుండా ఆత్మ విశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో హీల్‌ సీఈఓ కురపాటి అజయ్‌కుమార్‌, సమగ్ర శిక్ష అధికారులు భాస్కర్‌ కుమార్‌, శ్యామ్‌, సీనియర్‌ టెక్నీషియన్‌ కె చిన్నా పాల్గొన్నారు.

బస్సు యాత్రలో పాల్గొనాలి

తిరువూరు: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి బస్సుయాత్ర నిర్వహిస్తున్నందున కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య కోరారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్లో ఆదివారం జరిగిన నియోజకవర్గ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరువూరు పట్టణ పార్టీ మాజీ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆయన ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగుల్‌మీరా, మాలపాటి ఉదయ్‌, చిలుకూరి వెంకటేశ్వర్లు, త్యాగరాజు, రవి, వనమాలి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.